

# ప్రేముడి

## - మంథా భానుమతి



(ప్రారంభం)

**ఒకసారి గళ్ళన్నీ** చూసి కళ్ళు గట్టిగా మూసుకుంది కృష్ణవేణి. కళ్ళు మూసుకునే కుచ్చిళ్ళన్నీ ఒక దగ్గరికి చేర్చి పరికిణీ వెనక్కి గోచీ పెట్టింది. మొదటి గడిలో ఎడంకాలు పెట్టింది.

"పాసా!" తల పైకెత్తి అరిచింది.

"ఆ!" నలుగురమ్మాయిలు కోరస్.

"కృష్ణవేణీ!" రొప్పుతూ, గట్టిగా పిల్చాడు సాంబడు. ఎక్కడ్నుంచి పరుగెత్తుకుని వస్తున్నాడో..

కుడికాలెత్తి రెండో గళ్ళో పెట్టబోయిన కాలు అట్లాగే ఉంచి ఆగిపోయింది. కింద పెడ్తే అవుటయిపోతుంది. కళ్ళు తెరిచినా అవుటే. సరిగ్గా.. అప్పుడే పరికిణీ కుచ్చిళ్ళు విడిపోయి కాళ్ళకి అడ్డం పడి కింద పడిపోయింది. కాలు మెలిక పడి, చీలమండ దగ్గర బుసబుసా పొంగడం మొదలెట్టింది.

తొక్కుడు బిళ్ళ ఆడుతున్న అమ్మాయిలంతా చుట్టూ మూగారు.

"అయ్యో! అదేంటట్టా పడిపోయావు కృష్ణవేణీ.. మీ అమ్మా, నాయనా, అన్నా అవనిగడ్డెల్లొత్తామన్నారు. నీతో చెప్పమన్నారు. ఇప్పుడే బోటెక్కించొత్తన్నా.. అయినా అంత ఆత్రవేంటి చెప్పు." అమ్మాయిల్ని పక్కకి నెట్టి కింద కూర్చుని కృష్ణ వేణి కాలు ఒళ్ళో పెట్టుకుని పరీక్షించాడు సాంబడు.

మడమ దగ్గర చిన్నగా నొక్కగానే "అమ్మా!" అంటూ దిక్కులు పిక్కటిల్లేట్లు గగ్గోలు పెట్టింది. ఒక పక్క సాంబడి స్పర్శతో సేద తీరుతూనే!

"ఓ బట్టుంటే తడిపి తీసుకు రండి.." తలెత్తి అందర్నీ చూస్తూ అన్నాడు.

ఓణీలు తప్ప ఎవరి దగ్గరా గుడ్డ ముక్క లేదు. పైగా కను చూపు మేరలో నీటి చుక్క కూడా లేదు. ఎక్కడ చూసినా ముళ్ళతుప్పలూ.. ఇసకా, రాళ్ళూ కలిసిన నేలా! చుట్టూ చూసి పెదవి విరిచారు అమ్మాయిలు.

సరిగ్గా అప్పుడే..

సాంబడి తల్లి, వెంకమ్మ బిందెతో నీళ్ళు మోసుకొస్తూ, ఏం జరిగిందో అని ఆగింది. వెంకమ్మకి నలభైకి అటూ ఇటూగా ఉంటుంది వయసు. చీర కొంగునే తిప్పి నెత్తిమీద చుట్టలాగ చేసి పెట్టి, దాని మీద బిందె పెట్టుకుని వచ్చింది. బిందెలో నుంచి ఒక్క నీటి చుక్క కూడా కింద పడకుండా నడవడం ఆ పల్లెలో అందరికీ అలవాటే.

"ఏందే.. సందడి? ఎవరది?" బిందె నడుం మీదికి దింపి, అపురూపంగా పట్టుకుని గుంపులోకెళ్ళింది.

“అయ్యయ్యో! పిల్లని అట్టా పడేట్టెందుకు చేశారే.. మీ బండ బడా! మీ ఆటలూ మీరూ.. ఒళ్ళు పై తెలవదు.” బిందె కింద పెట్టి, తన కొంగు మీద నీళ్ళు చిలకరించి, ఆ తడి బట్టతో కృష్ణవేణి కాలు తుడిచి, చల్లని బట్టతో సున్నితంగా నొక్కసాగింది.

“మేవేం చేశా.. వేణికే కింద మీద తెలవదు, సాంబడి గొంతు వినగానే.” మూతి తిప్పుకుని అమ్మాయిలందరూ జారుకున్నారు. అక్కడే ఉంటే వెంకమ్మ కామా కూడా లేకుండా వాయిస్తూనే ఉంటుంది.

వెంకమ్మకి స్వయంగా అన్న కూతురు కృష్ణవేణి. అన్నా చెల్లెళ్ళవి ఎదురుబొదురిళ్ళే. సాంబడూ, కృష్ణవేణీ ఒకర్నొకరు ఆట పట్టించుకుంటూ, పోట్లాడుకుంటూ పెరిగారు. ఏ రోజైనా కృష్ణవేణి కనిపించకపోతే సాంబడికి పిచ్చెక్కినట్లే ఉంటుంది. దాని జడ పీకి, సున్నితంగా మొట్టికాయ మొట్టి ఏడిపించాల్సిందే.

నూనూగు మీసాల యవ్వనంలోకి అడుగు పెడ్తూ ఉండగానే, అప్పుడప్పుడే ఓణీలు వేసుకుంటున్న కృష్ణవేణి వేరుగా కనిపించడం మొదలు పెట్టింది సాంబడికి. ఇద్దరికీ మూడేళ్ళు తేడా. అనురాగం నిండిన కళ్ళతో ఆరాధనగా చూస్తుంటాడు.

నూనె రాసి నున్నగా తలదువ్వి జడేస్తే.. అది నాలుగు వేళ్ళ వెడల్పున, సన్నని మెడ పక్కనుంచి కనిపిస్తూ పిరుదుల మీద నాట్యం చేస్తుంటుంది. జడ చివర్న పువ్వులా కట్టిన రంగు రంగుల రిబ్బన్లు కవ్విస్తున్నట్లనిపిస్తుంది సాంబడికి. కృష్ణవేణి అందం అంతా చెంపకి చారెడేసున్న కళ్ళల్లో ఉంది. తనేమనుకుంటుందో ముందు కళ్ళతో చెప్పి, ఆ తరువాతే నోరు విప్పుతుంది. అయితే అదేంటో.. ఎప్పుడూ కూడా తన మనసులో మాటేదీ సాంబడికి అంతు చిక్కనియ్యలేదు.

పొద్దు గూకులూ కృష్ణవేణి తన గురించేమనుకుంటోందో అనే బాధే వాడికి. బెట్టుగా ఉన్నట్టే ఉండి, అప్పుడప్పుడు బైట పడిపోతుంటాడు, ఆప్యాయతనంతా చేతల్లో చూపిస్తూ.. టౌను కెళ్ళినప్పుడు పూసలగొలుసో, రంగుల గాజులో తెచ్చిస్తుంటాడు. అస్సలు కృష్ణవేణిని చూడగానే వెలిగిపోయే ఆ మొహవే చాలు.. ప్రత్యేకించి చెప్పాలా!

ఇంక పెద్దోళ్ళా..వాళ్ళకి  మహా గుట్టు. ఆ బ్రహ్మదేవుడు దిగొచ్చినా వాళ్ళ సంగతి కనిపెట్టలేడు. కృష్ణవేణి తల్లికి మాత్రం కూతురికి టౌన్లో సంబంధం చెయ్యాలని ఉంటుంది.. అదయినా, ఆ పల్లెటూళ్ళో తిప్పలు పడకుండా బ్రతకాలని కోరిక. గుక్కెడు నీళ్ళకి, పిడికెడు అన్నానికీ నడుం పగిలేట్టు నడవడం, చాకిరీ చెయ్యడం.. దానికైనా తప్పుతుందేమో అనే ఆశ.

“ఏమో.. ఎప్పుడేం రాసిపెట్టుందో, ఎవరికి తెలుసు? ఆ సమయం వస్తే అప్పుడు చూద్దాంలే..” వెంకమ్మ  వేదాంతం చెప్తుంది, ఎవరైనా అడుగుతే. అదే సాంబడికి చెడ్డ చిరాకు. తన మనసులో పొంగిపోతున్న ప్రేమసముద్రాన్ని ఒడ్డుకు తాక్కుండా గట్టిగా పట్టుంచాడు. అదే ఎన్నాళ్ళు.. అనేదే వాడి ప్రశ్న! ఎప్పుడో తుఫానులా విరుచుకు పడ్తాడు.. తప్పదు. ఒక్క కృష్ణవేణి సరే అంటే చాలు.. ఎవ్వరడ్డు పెట్టినా!

వెంకమ్మ మాటల్లో ఎంత అనుభవం దాక్కుని ఉందో, ఉడుకు రక్తం మీదున్న సాంబడికి తెలియట్లేదు. ఏ క్షణంలో ఏమవుతుందో! పిల్లలకి ఆశ కల్పించడం ఇష్టం ఉండదు ఆవిడకి. తల్లి ఎందుకట్టా ఉదాసీనంగా ఉంటుందో.. ఓ మాటనేసుకోవచ్చు కదా!

తల్లి చేసే పరిచర్యలు చూస్తుంటే.. కొంచెం ఆశ కలిగింది. ఎంత ప్రేమ లేకపోతే అట్టా.. కాళ్ళు పట్టుకుని సేవ చేస్తుంది? అంతా బెట్టు.. మగపిల్లడి తల్లి కదా! సాంబడి మొహంలోకి చిరునవ్వు వచ్చింది.

సరిగ్గా అప్పుడే కృష్ణవేణి కళ్ళు తెరిచి చూసింది. కనుబొమ్మలు ముడుచుకున్నాయి. “తనకేమో ఇంత నొప్పిగా ఉంటే.. ఈన గారికి నవ్వొస్తాందా! వేషాలేస్తన్నాడు.” కాలు చటుక్కున వెనక్కి లాగేసి, కూర్చోబోయింది.

“ఆగెహే! కాస్తంతైనా కుదుర్లేదు పిల్లకి..” తన చీర కొంగు చింపి గట్టిగా బిగించి కట్టుకడుతూ ముద్దుగా కసిరింది వెంకమ్మ.

నిశ్శబ్దంగా ఉన్న పరిసరాల్లో ఉన్నట్టుండి కలకలం..

"ఓహ్.. అయ్యయ్యో.. ఏందిరా ఇట్టైతాంది. ఎవర్రా అక్కడ.. కాసింత సాయానికి రండ్రా. వామ్మో! కొంపలు మునిగిపోతా ఉండాయిరా.." కలగా పులగంగా దూరం నుంచి, ఆక్రోశాలు.. ఆక్రందనలు.

మేనకోడలికి కట్టు కట్టేసిన వెంకమ్మ ఒక్క ఉదుట్న లేచింది. సాంబడు, అంత హడావుడిలోనూ, కృష్ణవేణి కాలు జాగ్రత్తగా కిందికి పెట్టి కేకలు వినిపించిన వైపుకి పరుగెత్తాడు. అది ఒడ్డు వైపు నుంచే వస్తోంది.

వెంకమ్మకేం చెయ్యాలో తోచట్లేదు. అటు సూర్యుడు విజృంభిస్తున్నాడు. ఎండలో.. కాలిపోతున్న నేల మీద నడవలేని పిల్లని వదిలేసి వెళ్ళలేదు. అక్కడ.. నదొడ్డున ఏదో ఘోరం జరిగిందని తెలుస్తోంది. అంతలో దర్జీ మస్తాన్ తన లూనా మీద ఒడ్డు కెళ్తూ ఆగాడు.

"అర్జంట్ కాకుంటే దీన్ని కాస్త ఇంటి దగ్గర దింపి రాకూడదంట్రా?" మస్తాన్‌ని అడిగింది. మస్తాన్, సాంబడు ఒకే వయసు వాళ్ళు. మస్తాన్ పది పాసవుతూనే కుల వృత్తిలో చేరి పోయాడు. సాంబడు ఇంటర్ పాసయ్యి.. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. రోజూ టౌన్లో కాలేజీ కెళ్ళి చదూ కోడం ఆషామాషీ కాదు.

"అత్తా! నేను కూడా ఒడ్డుకొస్తా. మస్తాన్, నన్ను.. తీసుకెళ్ళచ్చా" భయంగా తడ బడుతూ అడిగింది కృష్ణవేణి. కాలు నేల మీద పెట్టనియ్యట్లేదు. ఇంటి కైతే ఫర్లేదనుకుంది అత్త. మరి.. నదొడ్డుకి మస్తాన్ స్కూటర్ మీదంటే ఒప్పుకుంటుందా? అక్కడందరూ చూస్తే.. ఏమనుకుంటారో! అమ్మా వాళ్ళూ పడవలో వెళ్ళారంట.. అసలేమయిందో.. ఆతృతగా చూసింది కృష్ణవేణి.

"నేను కూడా అర్జంట్ గా అవనిగడ్డెళ్ళాలత్తా. దారాలు, బాపిన్ లూ తెచ్చు కోవాలి. కత్తెర కూడా విరిగి పోయింది." మస్తాన్ కి ఎటూ పాలు పోవట్లేదు. వెంకమ్మ అంటే చిన్నప్పట్నుంచీ గౌరవం, ఇష్టం. ఎన్నో సార్లు సాంబడితో వాళ్ళింట్లో పచ్చడి, చేపల పులుసుతో అన్నం తిన్నాడు. ఏదో అట్టా పడెయ్యటం కాదు.. ప్రేమతో ముద్దలు చేసి, కొడుకుతో తనక్కూడా పెట్టేది. కులం వేరు, మతం వేరు అని ఎప్పుడూ చూళ్ళేదు.

"సర్లే.. అట్టే పొండి. బండి మీద కలిసి ఇంటికెళ్తే ఒకటి, కిట్టమ్మ దగ్గరకెళ్తే ఒక్కటీనా?" వెంటనే మస్తాన్ బండి పరుగెత్తించాడు, కృష్ణవేణిని ఎక్కించుకుని.

వెంకమ్మకి మంచినీళ్ళ బిందె ఏం చెయ్యాలో అర్ధం కాలా. ఇంటికెళ్ళాలంటే కిలో మీటరు నడవాలి.

తిరిగి ఒడ్డుకి.. రెండు కిలోమీటర్లు. గుండె గుభేలు మంది. ఒడ్డున గోల ఎక్కువయింది.. ఊళ్ళో నుంచి జనాలు గుంపులుగా పరుగెత్తుకుని వెళ్తున్నారు.

"అత్తా! అర్జంట్ గా బండెక్కు. ఆ బిందట్టుకురా. నీళ్ళొంపేసి" మస్తాన్ కృష్ణ వేణిని దింపేసి వచ్చి వెంకమ్మ పక్కన బండాపాడు.

"ఏందిరా? గోల.." మాట్లాడకుండా.. వెంకమ్మ కూర్చోగానే బండిని పోనిచ్చాడు.

కృష్ణానది ఒడ్డున లూనా దిగగానే స్థాణువులా నిలబడి పోయింది వెంకమ్మ.

నదొడ్డున గందరగోళంగా, హృదయ విదారకంగా ఉంది పరిస్థితి. ఒకటే అరుపులు, పెడబొబ్బలు. ఎవరెటు పరుగెడుతున్నారో.. ఎవర్ని ఎవరు ఏం అడుగుతున్నారో..అంతా అయోమయం.

అద్దరికి వెళ్తున్న పడవ తల్లకిందులైపోయింది. పడవలో ఉన్న జనమంతా వడి వడిగా పారుతున్న కృష్ణమ్మ ఒడిలో పడిపోయారు. "అత్తా! అమ్మ, నాయన.." కృష్ణవేణి కాలు ఈడుస్తూ వచ్చి వెంకమ్మని వాటేసుకుంది, భోరుమని ఏడుస్తూ.

నీళ్ళల్లో కొట్టుకు పోతున్న వాళ్ళు కొందరు చేతులు పైకెత్తి ఊపుతున్నారు. కొంత దూరం వెళ్ళాక ఆ చేతులు కనిపించడం మానేశాయి. నావలో ఉన్న ఈతొచ్చిన మగాళ్ళు చేతికందిన వాళ్ళని, జుట్లు పట్టుకుని తీసుకొచ్చి ఒడ్డున పడేస్తున్నారు.

కృష్ణవేణి అన్న, ఇద్దరు చిన్న పిల్లల్ని ఒడ్డుకు చేర్చి, అమ్మని రక్షిద్దామని నీళ్ళల్లోకి దిగాడు. గజ ఈతగాడే.. అయితే ఏం లాభం.. ఉగ్ర రూపం దాల్చిన కృష్ణమ్మ ముందు అతని బలం పనికి రాలేదు. అమ్మతో సహా కొట్టుకు పోయాడు. నిస్సహాయులై, నీటి పాలయిన వాళ్ళందర్నీ తనతో సముద్రంలోకి తీసుకు పోయింది.. కృష్ణమ్మ.

“ఏమైందిరా? సాంబడేడిరా..” ఎలాగో నోరు పెగల్చుకుని అంది వెంకమ్మ.. గుండె దడదడ లాడుతుండగా.

“ఇక్కడున్నా లేమ్మా!” ఒళ్ళంతా నీళ్ళు కారుతూ వచ్చాడు సాంబడు.. అప్పుడే ఇద్దరు పాపాయిల్ని ఒడ్డుకి చేర్చి.. రొప్పుతూ, బట్టలు పిండుకుని ఇసకలో పడున్న వాళ్ల దగ్గరికి వెళ్ళాడు.

మస్తాన్ అప్పటికే సగం మంది చేత నోట్లోంచి నీళ్ళు కక్కించాడు, కడుపు నొక్కి.

మస్తాన్ కి ఈత రాదు. ఆ గ్రామంలో అతనొక్కడికే ఆ వయసు వాళ్ళలో ఈత రానిది. గుండె కొంచెం బలహీనంగా ఉందని చిన్నప్పుడు ఊళ్ళోకొచ్చిన మెడికల్ కాంప్ వాళ్ళు చెప్పారు. నీళ్ళల్లోకి దిగద్దని వాళ్ళమ్మ ఒట్టేయించుకుంది. అందుకే.. తను చెయ్యగలిగిన పనులు అతను చేస్తున్నాడు.

నీళ్ళు కక్కేశాక, తెలివొచ్చిన పిల్లలు అమ్మల కోసం గుండెలవిసేట్లు ఏడుస్తున్నారు. కొంత మంది ఇంకా తల్లి పాలు తాగుతున్న వాళ్ళే! ఎవరికీ ఏంచెయ్యాలో.. ఎక్కడ్నుంచి మొదలెట్టాలో అర్ధం అవడం లేదు. ఆడవాళ్ళు, అరవై ఏళ్ళు దాటిన మగవాళ్ళు చూస్తుండగానే నీళ్ళలో కలిసిపోయారు. ఇటువంటి ఉపద్రవాలు చూసిన వెంకమ్మే నడుం బిగించింది.

అక్కడున్న వాళ్ళల్లో మస్తాన్ దగ్గర మాత్రమే సెల్ ఫోనుంది. ఊరి సర్పంచ్ అవనిగడ్డలో ఉంటాడు.. పిల్లల చదువులంటూ. అతనికి ఫోన్ చేసి, వెంటనే జరగాల్సింది చూడమని చెప్పమంది.

ఏదయినా.. ఎంత త్వరగా చెయ్యాలన్నా.. కనీసం నాలుగయిదు గంటలు పడ్తుంది. వాళ్ళు ఉన్న చోటికి కాలి బాట తప్ప లేదు. ట్రాక్టర్లు, జీపులు మాత్రమే రాగలవు. మస్తాన్ లూనా ఒకటే అటూ ఇటూ తిరగ్గలిగిన మోటారు బండి. ముందు తాగడానికి నీటి చుక్క.. గొంతులు పీక్కు పోతున్నాయి జనాలకి.

వెంకమ్మ బిందే అక్కరకొచ్చింది. మస్తాన్ వంపెయ్యమని చెప్పినా, సగం నీళ్ళు ఉంచి పట్టుకొచ్చింది. అవి, దోసిళ్ళతో, పిల్లలకి తాగించారు. సర్పంచ్ కి ఫోన్ చెయ్యడం అయ్యాక బిందె తీసుకుని మంచి నీటి చెలమ దగ్గరికి వెళ్ళారు సాంబడూ, మస్తాన్.

జరిగింది చూస్తున్న సూర్యుడు కోపం ఆపుకోలేక చండ ప్రచండ రూపం దాల్చాడు. తన ప్రతాపమంతా ఆక్రోశిస్తున్న ఆ అసహాయ మానవుల మీద చూపిస్తున్నాడు. ప్రకృతి శక్తులు ఏకమయి తమ కోపాన్నంతా చూపిస్తాయి ఒక్కొక్కసారి..

“నీళ్ళు.. దప్పి..” ఒక్కొక్కళ్ళే పెదాలు తడుపుకుంటూ, రాచుకుపోయిన గొంతులతో ఏడుస్తున్నారు.

“సాంబా!” నాలుగేళ్ళ ముందు పిలిచిన ఆ పిలుపు.. ఆనందంతో, ఎగురుతూ.. చెరుకు గడలు తింటూ.. ఆట పట్టిస్తూ పిలిచిన పిలుపు.. ఇప్పుడు దీనంగా, సర్వం కోల్పోయి.. వంగిపోయి నిలుచున్న కృష్ణ వేణి నోట్లోంచి వచ్చింది. ఇంత కాలం, సిగ్గో, బిడియమో.. పెద్దల మౌనానికి భయపడో నోరు విప్పని కృష్ణవేణి, సాంబడ్ని పిలిచింది.. ఆక్రోశిస్తూ.

ఇంటి నుంచి గ్లాసులూ, ముంతలూ.. మంచి నీటి బిందె, తెచ్చి అందరి దాహార్తినీ తీరుస్తున్న సాంబడికి ఆ ఆర్తనాదం వినగానే గుండె చెరువై పోయింది. అప్పటికే పడుతూ లేస్తూ ఇంట్లో ఉన్న పాలూ, మజ్జిగ, నీళ్ళ బిందెలు, నెత్తిన పెట్టుకుని తీసుకొచ్చిన ఊరి ఆడంగులు బతికి బైట పడ్డ వారిని చూసుకుంటున్నారు.

సాంబడు, ఒక ముంత నిండా మజ్జిగ తీసుకుని కృష్ణవేణి దగ్గరికి వెళ్ళాడు.

"నాకిదేం వద్దు సాంబా! నా వాళ్ళు కావాలి. అమ్మా, నాన్నా, అన్నా.. ఏరీ.. ఎక్కడున్నారు? నేను కూడా ఆళ్ళ దగ్గరకే పోతా. ఒక్క దాన్నీ ఇక్కడేం చేయాల?" కృష్ణవేణి, నీళ్ళలో దూకడానికి పరుగెత్తింది.. అయోమయంగా చూస్తూ. అక్కడున్న అందరి పరిస్థితీ దాదాపుగా అదే..

సాంబడు, వెంకమ్మ చేతుల్లో ముంతని పెట్టి, రెండంగల్లో, కృష్ణవేణి జడని దొరక పుచ్చుకున్నాడు. గిరుక్కున తిరిగి వాడి రెండు భుజాలూ వేళ్ళతో గుచ్చుతూ, తలని ఎదకేసి కొట్ట సాగింది. కొండంత బలంగా అండగా నిలబడి, ఆ ఘాతాల్ని భరించాడు.. కదలకుండా!

సున్నితంగా, హత్తుకుని, తల నిమురుతూ ఓదార్చాడు.

"వేణీ! నీకు నే లేనా? మనకీ, ఆ గంగమ్మ తల్లికీ ఎప్పటాల్నుంచో ఉన్న బంధవే కదే ఇదీ! ఆవిడ గారికి ఆకలేసినప్పుడు తనలోకి లాక్కోడం మామూలే కద. ఊరుకోవే! నా బంగారు తల్లి కదూ!" మృదువుగా చెవిలో చెప్తూ, కొద్దిగా నీడున్న తుప్పల దగ్గరికి తీసుకెళ్ళి, కూర్చో పెట్టాడు.

"ఏం బంధం సాంబా? ఎన్నాళ్ళీ చివికి బతుకులు? గట్టి రోడ్లు, ఊరికి దగ్గర్లో మంచి నీళ్ళూ.. ఆస్పత్రీ, ఇయ్యన్నీ కలలేనా? ఇట్టా ఎంతమందిని పొట్టనెట్టుకోవాల?" వణుకుతూ, వెక్కుతూ.. గొణుగుతూ కళ్ళు మూసుకుని ఒరిగి పోయింది. సరిగ్గా గంట క్రితం, ఉరక లేస్తూ, ప్రపంచంలోని ఆనందమంతా తనదే అన్నట్లు ఆటలాడిన కృష్ణవేణి.

"ఏవైందిరా? పడవ ఎందుకట్టా ఒరిగిపోయింది? అదీ నడి మద్దిన.." దూరంగా ట్రాక్టర్ల శబ్దం వినిపిస్తుంటే.. కళ్ళకి అరచెయ్యడ్డు పెట్టుకుని చూస్తూ అడిగింది అప్పుడే అక్కడికొచ్చిన వెంకమ్మ.

"ఎప్పట్లానే తెల్లారీ తెల్లారకండానే తయారై పోయేరు ఊరోళ్ళంతా. అత్త, మామ.. సరుకులు తెచ్చుకోడానికి, బావ 'వల' రిపేరుకి.."

"సర్లేరా.. అది మామూలే గద.." నిస్త్రాణగా అంది వెంకమ్మ.. అసలు సంగతి చెప్పకుండా నాన్పుడు. విసుగనిపించింది. తల్లి హృదయమైనా, కొడుకు మీద అవధుల్లేని ప్రేమ ఉండీ.. వాడిక్కావలసింది చెప్పకుండానే తెలుసుకో గలిగినదైనా, ఆమెకి ఆ సమయంలో అర్ధంకానిది.. సాంబడు కూడా అదే స్థితిలో ఉన్నాడనీ.. మనసు, శరీరం కూడా మొద్దు బారిపోయి మెదడు చెప్పిన మాట వినట్లేదని.

"అర్జంట్ గా వెళ్ళొచ్చేయాలి.. ఇప్పుడు మంచి సీజన్ కూడా చేపలేటకి. నిన్న మొన్న డబ్బులు బాగనే మిగిలాయిలే. తిండి గింజలూ అవీ కావాలనీ.." ఏదో లోకంలో ఉన్నట్లు.. శూన్యంలోకి చూస్తున్నట్లు చూస్తూ.. కలగా పులగంగా మాట్లాడుతున్నాడు సాంబడు.

"సాంబా! ఏమయిందిరా?" వెంకమ్మకి అప్పుడు తట్టింది. తిండీ తిప్పలూ లేకుండా తిరుగుతున్నాడని. గ్లాసునిండా మజ్జిగ పోసి, పక్కన కూర్చుని తాగించింది. వాడి మొహంలో అలసట.. కళ్ళల్లో ఆపుకుంటున్న నీళ్ళు చూస్తుంటే కడుపులో పేగులు కదిలి పోయాయి వెంకమ్మకి. కళ్ళ లోంచి నీళ్ళు ధారలా కారిపోతున్నాయి.

"అమ్మా! నేను వద్దంటానే ఉన్నానే. ఎవ్వరూ ఇనిపించుకోలా."

తనకంటే అడుగున్నరెత్తున్న కొడుకుని పసిపిల్లడిలా ఒళ్ళోకి చేర దీసి అదుముకుంది. కొంచెం సేపటికి తేరుకున్నాడు సాంబడు.

"ఇరవై ఐదు మందికి మించి మోటర్ పడవలో ఎక్కకూడదే.. యాభై మందెక్కారు. అంత మటుకూ నెమ్మదిగా పారుతానే ఉంది కిట్టమ్మ. ఉన్నట్టుండి యెనకమాలే గాలి లేచిందట. పడవ ఊగిసలాడి కదిలి పోయిందట్నే! రెండో ట్రిప్పుకి వైటింగు చేస్తున్నాళ్ళు చెప్పారు. బాలంసింగు దెబ్బతిందంట. ఒక్క సారి అందరూ ఒకేపుకి ఒరిగేసరికి.. తలకిందులైపోయింది. ఇంకంతే.. అంతా ఆగవాగం. అప్పుడే నేనొచ్చా. కిట్టమ్మ ఉరకలేసుకుంటా వచ్చేసింది. కళ్ళముందే.. దూరమైపోయారే.." సాంబడు వెక్కుతూనే చెప్పాడు.

"అంతమందెక్కుతే ఏమవుద్ది మరి. మనోళ్ళకి ఎప్పటికి బుద్ధొస్తుందో!" పక్కనున్న వాళ్ళెవరో బొంగురు గొంతుతో అన్నారు.

“ఏం జేత్తార్రా మరి.. పడవ్వాడు బేరాన్నొదులుకుంటే ఎట్టాగని ఏడుత్తాడు. ఇప్పుడాడే ఇంతమంది నేడిపిత్తన్నాడు.” వెంకమ్మ చుట్టూ చూసింది. “ఏడాడు? ఆడు కూడ పొయ్యాడా? గజీతగాడు కద..”

“నలుగుర్ని ఒడ్డుకు చేరదీశాడు. ఆడ్ని పడవే లాక్కెల్లిపోయింది అంగీ దాని మేక్కి తగిలి.” ఇంకోడి గరగర గొంతు పలికింది.

అక్కడక్కడా ఉన్న ముళ్ళ పొదల అంతంత మాత్రం నీడల్లో ఇరుక్కుని గొంతుక్కూర్చున్నారు అందరూ. వేసుకున్న హవాయి చెప్పులు నేల మీదున్న వేడి నుంచి రక్షిస్తున్నాయి.

ఎవరికీ ఏడవడానిక్కూడా ఓపిక లేదు. స్తబ్దుగా అయిపోయారు.

అక్కడక్కడా పిల్లల ఏడుపులు సన్నగా వినిపిస్తున్నాయి. వాళ్ళకి పాలు పట్టించి, ఉన్నదేదో తినిపించీ ఊరుకోబెట్టారు ఊరి ఆడవాళ్ళు. మూడు నాలుగేళ్ళ పిల్లలు అక్కడే పొదల చాటున దాగుడు మూతలాడుకుంటున్నారు. మొత్తం పది మందున్నారు.

అంతలో.. ఒక ట్రాక్టర్ మీద, రెండు జీపుల నిండా జనం వచ్చి అక్కడ ఆగారు. సర్పంచ్ ఒక ట్రాక్టరు, రెండు జీపులు అక్కడికి చేరేశాడు అంతకు ముందెప్పుడో. డ్రైవర్లు మాత్రం అతనొొచ్చినప్పుడే వస్తారు.

సర్పంచ్ కరుణాకర్, జీపు లోంచి దూకగానే జనాలంతా చుట్టు ముట్టేసి.. ఒకే సారి మాట్లాడ్డం మొదలెట్టారు.

“అందరూ ఊళ్ళో కెళ్ళి మాట్లాడుకుందాం రా! పదండి.” కరుణాకర్ తనకి దగ్గరగా వచ్చిన ఇద్దరు ముగ్గురి భుజాల మీద చేతులేసి అన్నాడు.

“మరి కొట్టుకుపోయిన వాళ్ళ గురించి పట్టించు కోరాండీ?” నిస్సహాయంగా చేతులెత్తేశాడు సర్పంచ్.

“అందరూ సరాసరి సముద్రంలో కెళ్లి పోయార్రా. మీకు తెలవదా? ఎక్కడని వెతికిస్తాం. ఎప్పుడో ఎక్కడికో కొట్టుకొస్తారు. అది కూడా..” ఆపేశాడు. అక్కడున్న అందరికీ తెలుసు అతనేం చెప్పబోయాడో!

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments